క్లుప్తంగా

ఘనంగా నూకాలమ్మ తీర్థం



నూకాలమ్మ

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు మే నెల ఐదో తేదీ వరకూ జరుగుతాయని ఆయన అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో చేరుకున్న భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.20,232 విరాళం



దాత మేడేపల్లి ఐర-శ్రీద్రితిలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అంబాజీపేటకు చెందిన మేడేపల్లి ఐర, శ్రీద్రితి రూ.10,116, ముమ్మిడివరానికి చెందిన గ్రంధి సాయి హృతిక్ రూ.10,116 విరాళం అందజేశారు. మొత్తం అన్నదాన పథకానికి రూ.20,232 విరాళం అందినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతలు మేడేపల్లి ఐర, శ్రీద్రితి, గ్రంధి హృతిక్‌లకు ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతలను అభినందించారు.

వరి పంటకోత ప్రయోగం



చిరతపూడిలో వరి పంట కోత ప్రయోగం చేస్తున్న ఏఓ

అంబాజీపేట: ఆరుగాలం పండించిన పంటకు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు అంచనా దిగుబడి మొత్తాన్ని తెలుసుకునేందుకు మండలంలో పలు చోట్ల పంటకోత ప్రయోగాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం చిరతపూడిలో రైతు సాగు చేస్తున్న నందిపాటి శ్రీనివాసరత్నకుమార్ పంట భూమిలో 5 ఇన్‌టూ 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దాళ్వా పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ఎంటీయూ 1121 రకం పంటను కోసి ఒబ్బిడి చేయగా సగటున ఎకరాకు 42 నుంచి 45 బస్తాల చొప్పున దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో 32 వరి పంటకోత ప్రయోగాలు చేయాల్సి ఉండగా 7 ప్రయోగాలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఎం.రవితేజ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ మండల కో ఆర్డినేటర్ ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యం ద్వారా ఆరోగ్య రక్షణ

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పి మెరుగైన ఆరోగ్య రక్షణ పొందాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ప్రచారం
- పార్టీలో పలు పార్టీల నుంచి కార్యకర్తల చేరిక

ఆలమూరు: రాష్ట్రంలో గత ఐదేళ్ల నుంచి అభివృద్ధి, సంక్షేమంతో ప్రజారంజక పాలన సాగిస్తున్నా వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని నర్సిపూడిలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో శుక్రవారం భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో మద్దిరెడ్డి స్వామి కాపు, కందిబొట్ల లక్ష్మణరావు, బి.శ్రీనివాసరావు, గుత్తుల తాతారావు, కాదా గోవిందు, ఎం.విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. టీడీపీ, జనసేన పార్టీల అవకాశ, అనైతిక పొత్తుతో సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌ను ఓడించాలన్న దుష్ట పన్నాగానికి నిరసనగా వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని నాలుగోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుని మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే జగన్‌కు కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, ఉండమట్ల సూర్యం, ఎంఏఎస్ శాస్త్రి, గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నర్సిపూడిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఆత్రేయపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసినట్లు వైఎస్సార్ సీపీ కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని పులిదిండి, వసంతవాడ, తాడిపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. గత ప్రభుత్వంలో కేవలం వైఎస్సార్ సీపీ అభిమానులైన కారణంగా అర్హత ఉన్న వృద్ధులు, వికలాంగులకు సైతం పింఛన్లు రాకుండా అప్పటి జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయన్నారు. కానీ ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం ఎలాంటి రికమెండేషన్లు లేకుండా అర్హతే ఉంటే అన్ని పథకాలు అందించినట్లు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరలా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే తొలుత పులిదిండిలో



ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి హారతులు ఇస్తున్న దృశ్యం

వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ప్రజల్లో తిరుగులేని ఆదరణ

మామిడికుదురు: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో తిరుగు లేని ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు పేర్కొన్నారు. ఆదుర్రు గ్రామానికి చెందిన జనసేన నేత వలవల సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు శుక్రవారం జనసేనకు రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వాసు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి, వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ టీడీపీ, జనసేన విధానాలతో ఆ పార్టీల నేతలు విసిగిపోయారన్నారు. అందుకే టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కుసుమ శ్రీను, కుడుపూడి రామారావు, కోటిపల్లి శ్రీను, తోరం నాగు, నాగాబత్తుల శ్రీకృష్ణ, దాకే అశోక్, ముదకల సత్యనారాయణ, జక్కంపూడి సుబ్రహ్మణ్యం, బిరుదుగంటి రాజారావు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న వాసు

వైఎస్సార్ సీపీతోనే ప్రజా సంక్షేమం

రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి గొల్లపల్లి

మలికిపురం: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం జరుగుతుందని రాజోలు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజోలు మండలం నేటి నుంచి జరగబోయే పల్లెపల్లెకు గొల్లపల్లి ప్రచార యాత్ర విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కేఎస్ఎన్ రాజు, సీనియర్ నాయకులు బొంతు రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీరావు, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వినియోగించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఇసుకపూడిలో ఆరోగ్య సురక్ష రెండో విడత మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 40 ఏళ్లు దాటిన వారంతా బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఏమైనా దీర్ఘకాలిక రోగాలు ఉన్నట్లయితే ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం రోగులను, గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

29న సీఎం సభను విజయవంతం చేయాలి

మలికిపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 29న పి.గన్నవరంలో పాల్గొంటున్న భారీ బహిరంగ సభ విజయవంతానికి సమష్టి కృషి చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆ పార్టీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జనసమీకరణకు ఈ మేరకు పార్టీ ప్రముఖులు, పార్టీ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధిలు, కార్యకర్తలతో గొల్లపల్లి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గొల్లపల్లి మాట్లాడుతూ, రాజోలు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామ స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు పార్టీ మండల శాఖ అధ్యక్షులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభ విజయంతానికి ఆయా గ్రామాల్లో ఇందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కలుపుకుని కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. అలాగే బహిరంగ సభ ఏరియాకు వెళ్లేందుకు వీలుగా తగిన వాహనాలను గ్రామాల్లో ముందస్తుగా కార్యకర్తలు, నాయకులు సిద్ధం చేసుకోవాలని ఆయన అన్నారు. పార్టీ ప్రముఖులు బొంతు రాజేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, పార్టీ మండల శాఖల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, అడబాల బ్రహ్మజీరావు, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు సూరిశెట్టి బాబీ, బండారు కాశీ, నల్లి మోహన్, తాడి సహదేవ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 29న అంబాజీపేటలో నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కన్వీనర్ మంతెన రవిరాజు పిలుపునిచ్చారు. అంబాజీపేట ఏవీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన పార్టీ మండల సమావేశం శుక్రవారం జరిగింది. రవిరాజు మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరవుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అత్యధికంగా తరలి వచ్చేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఉభయ గోదావరి జిల్లా గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీఎం జగన్ సభను విజయవంతం చేసేందుకు సైనికుల్లా కష్టపడి పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎం.ఎం.శెట్టి, కొర్లపాటి కోటబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రవిరాజు

సమస్యలు పరిష్కరిస్తా... ఆశీర్వదించండి

అంబాజీపేట: గ్రామంలోని సమస్యలను పరిష్కరించడమే కాకుండా అందరికి అందుబాటులో ఉంటానని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వాకలగరువులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్వర్యంలో పార్టీ నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు నది పరీవాహక ప్రాంతంలో నివాసముంటున్నామని వరదల సమయంలో గట్లు కోతకు గురై ఇబ్బందులకు గురువుతున్నామని ఫిషర్‌మ్యాన్‌పేట శ్రీరామ్‌నగర్‌కు చెందిన మల్లాడి రవివర్మ వివరించారు. మంచినీటి సమస్య, కమ్యూనిటీ భవనం నిర్మించాలని, సీసీ రోడ్డు నిర్మించాలని వేణుగోపాలరావు దృష్టికి రవివర్మ తీసుకువెళ్లారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించి గ్రామంలో సస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక నాయకులు కడలి సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి బుజ్జిలతో పాటు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేణుగోపాలరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, గోగి శ్రీరామమూర్తి, కాండ్రేగుల నాగబాబు, కోలా సత్యనారాయణ, నాగాబత్తుల శ్రీనివాసరావు, కొత్తపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.



వాకలగరువులో ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు మద్దతు తెలుపుతున్న శ్రీరామ్‌నగర్ వాసులు

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి

మామిడికుదురు: వినూత్నమైన సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆదుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని పి.గన్నవరం అసెంబ్లీ, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు విప్పర్తి వేణుగోపాలరావు, రాపాక వరప్రసాదరావు కోరారు. లూటుకుర్రులో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని జగన్ అమలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని వేణుగోపాలరావు, వరప్రసాదరావు చెప్పారు. సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందిస్తున్న నేత జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనను రెండోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచార రథంపై తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో పలుచోట్ల మహిళలు హారతులు పట్టి నీరాజనం పలికారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, అడబాల చక్రపాణి, గెడ్డం మంగాలక్ష్మి, మట్టపర్తి శివ, చింతా రామకృష్ణ, కటకంశెట్టి ఆదిత్య, రామాయణం వెంకన్న, కడలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వరప్రసాదరావు, వేణుగోపాలరావు

స్క్రూటీ్నీ అనంతరం బరిలో అభ్యర్థులు వీరే..

కొత్తపేటలో 4 నామినేషన్ల తిరస్కరణ

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి దాఖలైన నిమినేషన్లలో 4 నామినేషన్లు తిరస్కరించినట్టు స్థానిక ఆర్‌డీఓ, ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమై ఈ నెల 25 తో ముగియగా వివిధ రాజకీయ పార్టీల తరఫున, ఇండిపెండెంట్లుగా 18 మంది అభ్యర్థులు 28 సెట్లు నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆర్‌ఓ కార్యాలయంలో ఆయా అభ్యర్థుల తరఫున ప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకుల సమక్షంలో ఆర్‌ఓ సత్యనారాయణ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. 18 మందిలో నలుగురి నామినేషన్లు తిరస్కరించారు. వారిలో వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేసిన చిర్ల లావణ్య అనే లక్ష్మీకోటేశ్వరి, టీడీపీ తరఫున నామినేషన్ వేసిన బండారు కమలారాణి, కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన కాశీవిశ్వనాథం రౌతు రాజకీయ పార్టీల ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించినందున, నామినేషన్ నందు ప్రతిపాదకుని పేరు ఒక్కటే ఉన్నందున, స్వతంత్ర అభ్యర్థిగా ఆమోదించుటకు అవకాశం లేనందున ఆయా నామినేషన్లు తిరస్కరించినట్టు ఆర్‌ఓ పేర్కొన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఇమ్మానుయేలు కుమార్ ఇసుకపట్ల ఏసీబీ కేసు ఫైల్ అయినందున ఆ నామినేషను తిరస్కరించినట్లు పేర్కొన్నారు.



కొత్తపేటలో నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తున్న ఆర్‌ఓ సత్యనారాయణ

రెండు నామినేషన్ల తిరస్కరణ

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ స్థానానికి సంబంధించి దాఖలైన నామినేషన్లలో వివిధ కారణాలతో రెండు నామినేషన్లు తిరస్కరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి నామినేషన్ సక్రమంగా ఉండటంతో.. ఆపార్టీ తరఫున డమ్మీగా నామినేషన్ వేసిన విప్పర్తి రామ్మోహన్‌రావు నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థి ఇసుకపట్ల ఇమ్మానుయేలు కుమార్ ధరావత్తు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. మొత్తం 17 మందికి గాను ఇద్దరి నామినేషన్లు తిరస్కరించగా, మిగిలిన 15 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయి.


వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా బీసీ నాయకుల పర్యటన



తూర్పుపాలెంలో తమ సామాజికవర్గానికి చెందిన వారితో బీసీ నాయకులు

మలికిపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ బీసీ సామాజిక మద్దతుదారులు శుక్రవారం వేర్వేరు గ్రామాల్లో పర్యటించారు. ఈ మేరకు మండలంలోని గొల్లపాలెం, తూర్పుపాలెం గ్రామాల్లోని బీసీ సామాజికవర్గానికి చెందిన వారిని వారంతా కలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి నెగ్గించుకోవాలని వారు కోరారు. నాయకులు గుబ్బల బాబ్జీ, చెల్లుబోయిన బుచ్చియ్య, శ్రీనివాస్, సాయిబాబు, కడలి నాగరాజు, కడలి మధు, గుబ్బల రమేష్, గుబ్బల వీవీ సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి శ్రీరాములు పాల్గొన్నారు.

అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదు



రాజోలులో మాట్లాడుతున్న కిషోర్

రాజోలు: ఏపీలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్ అన్నారు. ఏపీలో యువకులకు, శ్రామికులకు, రైతులకు ఎలాంటి ఉపకారం జరగలేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీలో యువతకు నాలుగు లక్షల యాభై వేల ఉద్యోగాలు కల్పించారన్నారు. ఆర్బీకేలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలోనే రైతులకు అవసరమైన అనేక పథకాలు అమలు చేశారనే విషయం పీయూష్ గోయల్‌కు తెలియకపోవడం విచారకరమన్నారు. ఢిల్లీ నుంచి వచ్చి వైఎస్సార్ సీపీపై బురదజల్లితే సహించేది లేదన్నారు. మాజీ సర్పంచ్ అడబాల నారాయణప్రసాద్, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, చింతా ప్రసాద్, రాపాక శ్రీను, రొక్కాల వెంకట్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలి

మామిడికుదురు: ముస్లింలపై విషం కక్కుతున్న బీజేపీతో పాటు ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న కూటమి అభ్యర్థులకు సార్వత్రిక ఎన్నికల్లో మైనార్టీలు తగిన గుణపాఠం చెప్పాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. నగరంలో శుక్రవారం జరిగిన మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనను ఆయన తప్పు పట్టారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన రిజర్వేషన్లతో ముస్లింలలో ఎంతో మంది నిరుపేదలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాతున్నారన్నారు. ఆ మహనీయుడిని రాజకీయ పార్టీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలు అమిత్ షా ప్రకటనను ఖండించకపోవడం దారుణమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఓడించాలన్నారు. ముస్లింలకు ఎంతో అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీని గెలిపించాలని సజ్జాద్ హుస్సేన్ కోరారు. సమావేశంలో నగరం ఉప సర్పంచ్ అన్వర్ తాహెర్ హుస్సేన్, సర్కిల్ ముస్తఫా హైదర్, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నగరం సమావేశంలో మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్

అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు

కొత్తపేట: రాబోయే విద్యా సంవత్సరం కళాశాలలో అడ్మిషన్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ (సీసీఈ) రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులకు సూచించారు. ఆర్జేడీ శోభారాణి శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలో అకడమిక్, ఆఫీస్ వ్యవహారాలను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్ పరిశీలించి ఆ విభాగంలో విద్యార్థుల ప్రగతి గురించి ఆరా తీశారు. లైబ్రరీ విభాగాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న బుక్స్ ఏంటి? అవసరమైన అకడమిక్ బుక్స్ ఉన్నాయా? వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారా? విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు తదితర అంశాలపై ఆరా తీశారు. నూతనంగా నిర్మించిన క్లాస్ రూమ్స్‌ను, కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో నూతన విద్యా ప్రణాళిక, విద్యాభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. కళాశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అన్ని సౌకర్యాలు, అవసరమైన అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఉన్న ఈ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో గడచిన విద్యా సంవత్సరం కంటే మించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని ఆర్‌జేడీ శోభారాణి సూచించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ శోభారాణి

అవగాహనతోనే మలేరియా నిర్మూలన

ఆలమూరు: ఆరోగ్య అవగాహన, ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా మహమ్మారి నిర్మూలన సాధ్యమని జిల్లా మలేరియా యూనిట్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో గత మూడు రోజుల నుంచి నిర్వహించిన మలేరియా నిర్మూలన ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మలేరియా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గ్రామాల వారీగా ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొని భారీ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. 'మలేరియాను తరిమి కొట్టేందుకు అందరూ సిద్ధమవుదాం' అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. సమావేశంలో మలేరియా వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలను జిల్లా అధికారి వెంకటేశ్వరరావు వివరించారు. గ్రామాల్లో మలేరియా వ్యాధి నివారణపై తరచూ ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.